క్లుప్తంగా

సంక్షేమ పథకాలు ప్రజలకు తెలపాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు

జమ్మికుంట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి తెలపాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, తమిళనాడు అల్పకాలిక విస్తారక్ రాధాకిషన్ అన్నారు. గురువారం పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లేశ్ ఆధ్వర్యంలో జమ్మికుంటలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పీఎం మోదీ తొమ్మిదేళ్లలో అవినీతి లేకుండా దేశ అభివృద్ధే లక్ష్యంగా పని చేశారని కొనియాడారు. ప్రతిపక్షాలు మోదీ ప్రతిష్టను దెబ్బతీయాలని, మతతత్వ పార్టీగా ముద్రవేయాలని చూస్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కోరే రవీందర్, రాజేశ్ ఠాకూర్, పల్లపురవి, మోతె స్వామి, ఇటుకాల స్వరూప, కైలాసకోటి, నిరుపరాణి, మోడం రాజు, కొండ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయ్‌రెడ్డిని కలిసిన గంగాడి కృష్ణారెడ్డి



ఉదయ్‌రెడ్డికి పుస్తకం అందజేస్తున్న గంగాడి కృష్ణారెడ్డి

వీణవంక: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా గురువారం మండల కేంద్రంలో ప్రముఖ పారిశ్రామికవేత్త యూప్ టీవీ సీఈవో పాడి ఉదయ్‌రెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మోదీ తొమ్మిదేళ్ల సుపరిపాలన, దేశాభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయాలను వివరించారు. మోదీ పాలన విశేషాలతో రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని ఉదయ్‌రెడ్డికి అందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు నరసింహరాజు, బింగి కరణాకర్, మాడ గౌతంరెడ్డి, రామిడి అదిరెడ్డి, బత్తిని నరేష్, గౌడుగు వినోద్‌కుమార్ యాదవ్, పెద్ది మల్లారెడ్డి, చెల్పూర్ సర్పంచ్ నేరేళ్ల మహేందర్‌గౌడ్, చెపూరి రాజు, మడగురి సమ్మిరెడ్డి, తిరుపతిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘గూడు’ ఇచ్చేదెప్పుడో..?

- ముందుకుసాగని డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులు
- హుజూరాబాద్, జమ్మికుంటలో నిర్మించినా పంపిణీ చేయని వైనం
- వీణవంక, ఇల్లందకుంట మండలాల్లో కూలిపోతున్న ఇళ్లు
- అసెంబ్లీ ఎన్నికలలోపు అర్హులకు అందేనా...?
- ఇళ్ల కోసం ఏళ్లుగా ఎదురుచూపు



వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పరిస్థితి

హుజూరాబాద్: నీడలేని నిరుపేదలకు గూడు కట్టించాలనే ఉద్దేశంతో 'డబుల్ బెడ్‌రూం' ఇళ్ల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగా హుజూరాబాద్, ఇల్లందకుంట, జమ్మికుంట, వీణవంక మండలాల్లోని గ్రామాలకు ఆరేళ్ల క్రితం ఇళ్లు మంజూరు చేశారు. హుజూరాబాద్‌లోని సిర్సపల్లి రోడ్డులో నిర్మించిన ఇళ్లు మూడేళ్ల క్రితం పూర్తి చేశారు. కానీ లబ్ధిదారుల ఎంపిక అటకెక్కింది. అదేవిధంగా జమ్మికుంట పట్టణంలోని కొత్త మార్కెట్ ఏరియాలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల దుస్థితి కూడా అలాగే ఉంది. ఇల్లందకుంట, వీణవంక మండలాల్లో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సకాలంలో పనులు పూర్తి చేయాల్సి ఉండగా చేసిన పనులకు బిల్లులు రావడంలేదని మధ్యలోనే వదిలేశారు. దీంతో డబుల్ బెడ్‌రూం ఇళ్లు వస్తాయని ఆశతో ఎదురు చూసిన లబ్ధిదారులకు నిరాశేమిగిలింది. ఇప్పటికే ఆయా గ్రామాల్లోని నిరుపేదలు ఇళ్ల కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఇప్పటికైనా ఇళ్లు ఇస్తారా ? లేదా? అని అర్హులు మదనపడుతున్నారు. 'డబుల్' ఇళ్లకు బదులు జాగా ఉన్నవారికి ఇల్లు కట్టుకుంటే రూ.3లక్షలు ఇస్తామని సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించారు. దీంతో డబుల్ బెడ్‌రూం ఇళ్లు ముందుకు సాగడం లేదు. అయితే గతంలో నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు ఇస్తే ఎంతో కొంత మందికి న్యాయం జరుగుతుందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

నియోజకవర్గంలో 1,206 ఇళ్లు మంజూరు

నియోజకవర్గంలోని జమ్మికుంట 500, హుజూరాబాద్ 500, ఇల్లందకుంట 111, వీణవంక మండలాలకు 95 ఇళ్లు మంజూరయ్యాయి. 1,206 ఇళ్లకు రూ.66 కోట్లు కేటాయించగా ఇందులో 784 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మిగిలిన ఇళ్లు అసంపూర్తిగా ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అర్బన్ ప్రాంతంలో ఒక్కో ఇల్లుకు రూ.5.30 లక్షలు, రూరల్ ప్రాంతంలో రూ.5.04లక్షలు కేటాయించారు. హుజూరాబాద్‌లో 500 ఇళ్ల పనులు పూర్తి కాగా మూడేళ్ల నుంచి లబ్ధిదారుల ఎంపిక జరగడంలేదు. ఇళ్ల తలుపులు, కిటికీలను ఆకతాయిలు ధ్వంసం చేశారు. మందుబాబులకు అడ్డాగా ఇళ్లు మారాయి.

మండలాలవారీగా ఇళ్ల వివరాలు

మండలం	ఇళ్లు	నిర్మించినవి	అసంపూర్తిగా
వీణవంక	95	40	55
ఇల్లందకుంట	111	52	59
జమ్మికుంట	500	152	348
హుజూరాబాద్	500	500	-

మొత్తం వ్యయం : రూ.66కోట్లు

ఉపఎన్నికతో కాస్త ఆశలు

ఈటల రాజేందర్ రాజీనామాతో హుజూరాబాద్ నియోజకవర్గంలో ఉపఎన్నిక జరిగింది. అయితే అదే సమయంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు త్వరలోనే ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి అర్హులకు అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ హామీలు ఇప్పటి వరకు నెరవేరలేదు. దీంతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి చెందడంతో ఇళ్ల సమస్య ఇప్పటి వరకు ఎటూ తేలడం లేదు. నిర్మించిన ఇళ్లు శిథిలావస్థకు చేరుతున్నాయి.

ముళ్లపొదల దర్శనం

వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో 20 ఇళ్లు మంజూరు కాగా ఇందులో 10 ఇళ్ల పనులు స్లాబ్‌లెవల్ వరకు చేశారు. అప్పటి నుంచి నాలుగేళ్లుగా పనులు నిలిచిపోయాయి. ఇందులో మూడు ఇళ్లు గోడలు కూలిపోయాయి. మిగిలిన ఇళ్లు కూడా పూర్తిగా శిథిలావస్థలోకి చేరాయి. ముళ్ల పొదల్లు ఇళ్లను మించి పెరిగిపోవడంతో అక్కడ అధ్వాన పరిస్థితి కనిపిస్తోంది. కోర్కల్‌లో ఇళ్లు నిర్మించి రెండేళ్లు గడిచిన లబ్ధిదారులకు ఇవ్వడంలో అధికారులు చేతులెత్తాశారు. ఇల్లందకుంట మండలంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులు త్వరగా పూర్తి చేసి అర్హులైన పేదలకు అందించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్ అండ్‌బీ డీఈ బాపిరెడ్డిని వివరణ కోరగా పనులు నిలిచిపోయాయని మళ్లీ ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయంపై క్లారిటీ లేదని తెలిపారు.

పూర్తయిన ఇళ్లు అర్హులకు ఇవ్వాలి



డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. నిర్మించిన ఇళ్లు అర్హులకు ఇవ్వకుండా వృథాగా ఉంచడం వల్ల ప్రభుత్వానికి ఏమస్తుందో అర్థం కావడం లేదు. నిరుపేదలు ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. మంత్రులు పట్టించుకోకపోవడం బాధాకరం. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు స్పందించాలి. నిర్మించిన ఇళ్లను పంపిణీ చేయాలి. అసంపూర్తి ఇళ్లు పూర్తి చేయాలి.

– కుడికాల రమేశ్, దరఖాస్తుదారుడు, హుజూరాబాద్

ఏళ్లు గడుస్తున్నా కేటాయించడంలేదు



ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇల్లు మంజూరు చేస్తుందంటే దరఖాస్తు చేసుకున్నా. అధికారులు ఇల్లు కేటాయింపు కోసం వచ్చి దరఖాస్తును పరిశీలించి సర్వే చేశారు. దరఖాస్తు చేసి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఇల్లు మాత్రం కేటాయించలేదు. కిరాయి ఇంట్లోనే ఉంటూ కాలం వెళ్లదీస్తున్నాం. ఇప్పటికైనా కట్టిన ఇళ్లను అర్హులైన వారికి మంజూరు చేయాలి.

– జక్కెన దామోదర్, దరఖాస్తుదారుడు, జమ్మికుంట

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

- ప్రత్యేక పూజలు
- కిటకిటలాడిన దేవాలయాలు



హుజూరాబాద్: బోనాలతో తరలివెళ్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, తదితరులు

హుజూరాబాద్: హిందువుల తొలి పండుగగా భావించే తొలి ఏకాదశి పర్వదినాన్ని గురువారం హుజూరాబాద్‌లో హిందువులు సాంప్రదాయ బద్ధంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆషాఢ మాసంలో వచ్చే ఏకాదశిని తొలి ఏకాదశి, శుద్ధ ఏకాదశి, 'శయన ఏకాదశి' 'హరివాసరం'అనే పేర్లతో పిలుస్తారు. ఈ పర్వదినం రోజున హిందువులు ఇళ్లను శుభ్రం చేసుకుని మామిడి తోరణాలు కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. కొందరు కొత్త వస్తువులతో పండుగ ప్రారంభించారు. విష్ణుమూర్తికి పూజలు, ఉపవాసం ఉన్నారు. వేద పండితులు శ్రీధర్ ఆచార్యులు, నందకుమారాచార్యులు పండుగ విశేషం వివరిస్తూ నేటి నుంచి కార్తిక శుద్ధ ఏకాదశి వరకు 'చాతుర్మాస్య వ్రతం'అవలంబిస్తూ శాకాహారులై ఉపవాస వ్రతం ఆచరించాలనేది చాతుర్మాస్య వ్రత నియమమని, ఏకాదశినాడు ఉపవసించి, ద్వాదశి నాడు ఉపవాస దీక్ష విరమించాలని దానివల్ల పుణ్యం లభిస్తుందని వివరించారు. పండుగ సందర్భంగా వైష్ణవ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని యాదవ కులస్తులు గురువారం హుజూరాబాద్ పట్టణంలో ఘనంగా బీరన్న దేవునికి సాంప్రదాయ బద్ధంగా బోనాలను సమర్పించారు. యాదవ కుల పెద్దలు ఆచారం ప్రకారం గొల్లవాడ నుంచి మహిళలు నెత్తిన బోనాలు, డప్పు చప్పుళ్ల మధ్య ర్యాలీగా సిర్సపల్లి రోడ్డులోని బీరన్న దేవాలయంకు చేరుకుని బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక నెత్తిన బోనంతో ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం బీరన్న దేవునికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. చల్లగా చూడాలని బీరన్న దేవుడిని వేడుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కుమార్, మండల యాదవ కుల సంఘ అధ్యక్షుడు రాజ్‌కుమార్ యాదవ్, కులపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణం, మండలంలోని గ్రామాల్లో తొలి ఏకదశిని గురువారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని కేశవాపురంలో బీరప్ప దేవాలయంలో గొల్ల, కురుమలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగిళి రమేష్, కౌన్సిలర్ పాతకాల రమేష్, గుంటి సామ్రాజ్యం, కురుమ సంఘం నాయకులు ఒగ్గు రమేష్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

భక్తుల సహకారంతోనే కల్యాణ మండపం నిర్మాణం



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఆలయ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి

తిమ్మాపూర్: తాపాళ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మండపం భక్తుల సహకారంతోనే నిర్మించామని ఆలయ కమిటీ చైర్మన్ ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి అన్నారు. మండలంలోని మహాత్మానగర్ గ్రామం శ్రీ తాపాళ లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి అనుబంధంగా రూ.కోటితో నిర్మించిన కల్యాణ మండపాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్యాణ మండపంలో స్వామివారి కల్యాణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మండప నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, విరాళాలు అందజేసిన దాతలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతిరెడ్డి వనిత, సర్పంచ్ జక్కని శ్రీవాణి, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి, రామకృష్ణకాలనీ ఉప సర్పంచ్ గుజ్జుల ప్రణీత్‌రెడ్డి, ఆలయ గౌరవ అధ్యక్షుడు ఎడ్ల నారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి ఎల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు మడుపు అనంత రెడ్డి, అడిశర్ల సత్యనారాయణ, తిరుపతి, కేతిరెడ్డి సింగారెడ్డి, గుంటుక కనకయ్య, గాదె వెంకటపతి, గూడ కమలాకర్,గూడ తిరుపతి, ఆలయ అర్చకులు తిరునగిరి వెంకటాద్రి స్వామి, రాంబాబు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు వెంకటస్వామి

ప్రమాదకరంగా ఎయిర్‌వాల్వ్ పైకప్పు

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి ఎక్స్ రోడ్డు పక్కన మంచినీటి పైప్‌లైన్ ఎయిర్ వాల్వ్ పైకప్పు ప్రమాదకరంగా మారింది. రోడ్డు పక్కనే ఉండటంతో ప్రయాణికులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని హన్మాజిపల్లె గ్రామ సమీపంలోని ఎల్‌ఎండీ నుంచి సిద్దిపేట జిల్లాకు తాగునీటి సరఫరాకు సంబంధించి హన్మాజిపల్లె, జంగపల్లి, గునుకులకొండాపూర్, గుండ్లపల్లి మీదుగా పైపులైన్ నిర్మాణం చేపట్టారు. సమీపంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, ప్రమాదం జరగకముందే నివారణ చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌టీపీ జిల్లా నాయకుడు సంపతి ఉదయ్‌కుమార్ కోరారు.



సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు



హుజూరాబాద్‌లోని ఈద్గాలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న బల్మూరి వెంకట్



జమ్మికుంట: బిజిగిరిషరీఫ్ ఈద్గాలో..



శంకరపట్నం: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

హుజూరాబాద్: త్యాగానికి ప్రతీక బక్రీద్, పట్టణంలో ముస్లింలు పండుగను ఘనంగా జరుపుకున్నారు. మతపెద్దలు పండుగ విశేషం, చేయాల్సిన పనులను వివరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు అలయ్ బలయ్ తెలుపుకున్నారు. బక్రీద్ సందర్భంగా గురువారం హుజూరాబాద్ ఈద్గా మైదానంలో ముస్లింల ప్రార్థనల అనంతరం ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బల్మూరి వెంకట్ ముస్లింలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నాయకులు సొల్లు బాబు, కొల్లూరి కిరణ్, ఎండీ అప్సర్, పలువురు ముస్లిం మత పెద్దలు ఉన్నారు.

శంకరపట్నం: బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని కేశవపట్నం, మొలంగూర్, అంబాల్‌పూర్ , కరీంపేట, తాడికల్ ఏరడపల్లి గ్రామాల్లో బక్రీద్ సందర్భంగా ముస్లింలకు హిందువులు శుభాకాంక్షలు చెప్పారు. ఈద్గాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చిగురుమామిడి: మండలంలోని వివిధ గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ప్రతి ఒక్కరూ క్షేమంగా ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థనలు చేశామని చెప్పారు. ఈ ప్రత్యేక ప్రార్థనల్లో మసీదు పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ముస్లింలు బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎండీ రఫీ,ఎండీ జాఫర్, సత్తార్, రఫీ, రజాక్, గౌస్, సలీం, సమీర్, సయ్యద్ లాలు, ముజీర్, నజీర్ పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని గ్రామాలలో ముస్లింలు బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. రామడుగు, గుండి, గోపాల్‌రావుపేట, వెలిచాల, వెదిర, దేశరాజ్‌పల్లి, తిర్మలాపూర్‌లో మసీదుల్లో ప్రార్థనలు చేశారు. అనంతరం బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ముస్లింలకు ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు.

చొప్పదండి: మండల కేంద్రంలో ముస్లింలు బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. ప్రార్థనా స్థలంలో సామూహిక నమాజ్, మత పెద్దలు బోధనలు చేశారు. ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశారు.

జమ్మికుంట: పట్టణం, మండలంలోని గ్రామాలు, బిజిగిరిషరీఫ్ దర్గాలోని ఈద్గాలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేసి బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. మతగురువు మౌలానా నౌమాన్ హష్మీ ఖురాన్‌లో సూక్తులను చదివి వినిపించారు. హజ్రత్ ఇబ్రహీం అలైహి సలాం, హజరత్ ఇస్మాయిల్ అలైహి సలాం త్యాగనిరతిని ముస్లింలకు వివరించారు. మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండల వ్యాప్తంగా హిందు, ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో తొలిఏకదశి, బక్రీద్ వేడుకలను జరుపుకున్నారు. మతాలకు అతీతంగా శుభాకాంక్షలు తెలపుకున్నారు. మండలంలోని చెల్పూర్,కందుగుల తదితర గ్రామాలలో ముస్లింలు మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

శంకరపట్నం: బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని కేశవపట్నం, మొలంగూర్, అంబాల్‌పూర్, కరీంపేట, తాడికల్ ఏరడపల్లి గ్రామాల్లో ముస్లింలకు హిందువులు శుభాకాంక్షలు చెప్పి ఆలింగనం చేసుకున్నారు. ఈద్గాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



రామడుగులో ముస్లింల ప్రార్థనలు



చొప్పదండిలో...



సైదాపూర్‌లో...

ఏకలవ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలి

మానకొండూర్: రాష్ట్ర ప్రభుత్వం ఏకలవ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ ఎరుకల ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షుడు కెమసారం తిరుపతి అన్నారు. మానకొండూరు, పచ్చునూరు గ్రామాల్లో ఏకలవ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఏకలవ్య స్ఫూర్తితో హక్కుల కోసం ఎరుకల కులస్తులు ఉద్యమించాలని, ఎరుకల కోసం ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి ఏకలవ్య ఆశయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సంపత్, అంజయ్య, ఉండాడి వెంకటేష్, సాగర్, శ్రీను, రాజశేఖర్, కిరణ్, జాంతు రమేష్, జాంతు సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఏకలవ్య జయంతి నిర్వహిస్తున్న నాయకులు

సాయిచంద్ మృతి తీరనిలోటు

చొప్పదండి: తెలంగాణ ఉద్యమాన్ని పాట, మాటలతో పదునెక్కించిన ఉద్యమ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ మృతి తీరని లోటని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గురువారం సాయిచంద్ ఆకస్మిక మృతికి సంతాపం తెలిపారు. తెలంగాణ గొప్ప గొంతుకను కోల్పోయిందని, రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలను చైతన్య పరిచిన సాయిచంద్ పాత్ర విస్మరించలేనిదని కొనియాడారు.